ప్రజాకలం
గురువారం, ఫిబ్రవరి 8, 2024

## హామీలన్నీ అమలు చేసి తీరాల్సిందే.

హుజూరాబాద్ మండలంలోని రంగాపూర్ గ్రామం లో ఎంపి బండి సంజయ్ మీడియాతో మాట్లాడారు. కేంద్ర పథకాలను వివరిస్తూ ప్రజలను చైతన్యం చేయడమే గావ్ చలో అభియాన్ లక్ష్యం. రంగాపూర్ గ్రామంలో ప్రజలతో మమేకమయ్యాను? సమస్యలు అడిగి తెలుసుకున్నాను. కేంద్ర అభివృద్ధి పథకాలతోపాటు గ్రామానికి మోదీ ప్రభుత్వం ఇచ్చిన నిధుల వివరాలను ప్రజల ముందుంచినానని అన్నారు. 10 ఏళ్లుగా ఒక్క కొత్త రేషన్ కార్డు ఇవ్వలే. కొత్త రేషన్ కార్డుల కోసం 10 లక్షల కుటుంబాలకుపైగా ఎదురు చూస్తున్నాయి. కొత్త ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే వారందరికీ ఆరు గ్యారంటీ హామీలను అమలు చేయాలి. యుద్ధ ప్రాతిపదికన వారం రోజుల్లోనే కొత్త రేషన్ కార్డులివ్వాలని అన్నారు. 200 యూనిట్ల వరకు ఫ్రీ కరెంట్, రూ.500లకే గ్యాస్ సిలిండర్ ను వాళ్లకు కూడా అందించాల్సిందే. పార్లమెంట్ ఎన్నికల షెడ్యూల్ ఈనెలలోనే ఎప్పుడైనా విడుదలయ్యే అవకాశం వుంది. ఈ విషయం ప్రజలందరికీ తెలుసు. ఈలోపే కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలన్నీ అమలు చేసి తీరాల్సిందే.

షెడ్యూల్ వచ్చేదాకా జాప్యం చేసి తప్పించుకుని ప్రజలను మోసం చేస్తే ఊరుకోం. ఎకరానికి రూ.15 వేల రైతు బంధు ఇస్తానన్న హామీని అమలు చేయాలి. మహిళలకు రూ.2,500లు, రూ.4 వేల పెన్షన్, ఇండ్ల స్థలంతోపాటు రూ.5 లక్షల సాయం, రూ. 2 లక్షల రుణమాఫీ హామీలను అమలు చేయాల్సిందే. వెంటనే ఉద్యోగ నోటిఫికేషన్ వేయాలి.... 317 జీవోను సవరించాల్సిందే.

మీరు ఇచ్చిన హామీలన్నీ అమలు చేయడానికి మీ దగ్గరున్న ప్రణాళిక ఏమిటో ప్రజల ముందుంచండి. మీరే రాష్టంలో ఆర్ధిక పరిస్థితి బాగోలేదన్నారు. గత ప్రభుత్వం రాష్ట్రాన్ని లూటీ చేసిందని మీరే అన్నారు. హామీలు కూడా మీరే ఇచ్చారు. వాటిని ఎట్లా అమలు చేస్తారో అసెంబ్లీ వేదికగా ప్రజల ముందుంచాలి. ఆరు గ్యారంటీల అమలుతోపాటు మేనిఫెస్టో హామీల అమలు కోసం అసెంబ్లీని వేదికగా ఉపయోగించండి. అట్లాగాకుండా ఒకాయనేమో అసెంబ్లీలో మీ సంగతి చూస్తానంటడు.. ఇంకోకాయనేమో నన్ను టచ్ కూడా చేయలేవని అంటడు. అసెంబ్లీ వేదికగా ఆరోపణలు, ప్రత్యారోపణలు చేస్తే ప్రజలకు ఏం లాభం? ప్రజల సంగతి ఎవరు తేల్చాలి. వాళ్లకు ఇచ్చిన హామీలను అమలు చేసే దెవరని అడిగారు. మీరు ఒకరికొకరు తిట్టుకోవాలని, కొట్టుకోవాలని అనుకుంటే... మేమే పరేడ్ గ్రౌండ్ వేదికగా ఏర్పాట్లు చేస్తాం... ఎవరేందో తేల్చుకోండి. కానీ అసెంబ్లీని మాత్రం తిట్టుకోవడానికి ఉపయోగించొద్దని కోరుతున్నా...

కాంగ్రెస్, బీఆర్ఎస్ రెండు పార్టీలు ఒకరికొకరు తిట్టుకుంటూ వ్యూహాత్మకంగా ప్రజల ద్రుష్టిని మళ్లించడమే ధ్యేయంగా పెట్టుకున్నాయి. రెండు పార్టీలు ఒక్కటే... హామీల అమలుపై ద్రుష్టి మళ్లించాలని కాంగ్రెస్, గత ప్రభుత్వ తప్పిదాలు బయటకు రాకుండా ప్రజల దృష్టిని మళ్లించాలని బీఆర్ఎస్ ప్రయత్నిస్తున్నాయి. రాష్ట్ర ప్రజలారా... రెండు పార్టీల డైవర్ట్ పొలిటిక్స్ ను గమనించాలని, జాగ్రుతం కావాలని కోరుతున్నా. కొందరు నేతలు హద్దు మీరి అసభ్య పదజాలంతో మాట్లాడుతున్నరు. ఇది ఏమాత్రం తగదు.ముఖ్యమంత్రి పదవికి గౌరవం ఇవ్వాల్సిన అవసరం మనందరిపైనా ఉంది. సీఎం పదవిని చెప్పుతో కొడతానని బీఆర్ఎస్ నేతలు మాట్లాడటం కరెక్ట్ కాదు.. బీఆర్ఎస్ పార్టీ అహంకారపూరిత వైఖరిని ఇట్లాంటి మాటలే నిదర్శనం. కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఈనెల 10 నుండి మేడిపల్లి నుండి ప్రజాహిత యాత్ర చేస్తున్నాం. గ్రామాల్లో పాదయాత్ర చేస్తాం.. ఒక గ్రామం నుండి మరో గ్రామానికి వెహికల్ లో వెళతాం. ఈనెల 15 వరకు ప్రజాహిత యాత్ర తొలిదశ పూర్తి చేస్తాం. ఈనెల 20 నుండి మలి దశ ప్రజాహిత యాత్రను కొనసాగిస్తాం. దేశమంతా మోదీ గాలి వీస్తోంది... సర్వే నివేదికలన్నీ బీజేపీ గెలుస్తుందని చెబుతున్నాయి. తెలంగాణలో 17కు 17 స్థానాలు గెలుస్తామని అన్నారు.

వినోద్ కుమార్ ఎంపీగా ఉన్నప్పుడు ఎన్నడైనా ప్రజలను కలిశారా ? పైసలు సంపాదించుకోవడం, కేసీఆర్ కుటుంబానికి దోచి పెట్టడం తప్ప సాధించిందేమిటి ? కరీంనగర్ వరంగల్ హైవే నిధులు ఎవరు తెచ్చారు? సిద్దిపేట ఎల్కతుర్తి హైవే నిధులెవరు తెచ్చారు ? స్మార్ట్ సిటీ నిధుల రాష్ట్ర ప్రభుత్వం దారి మళ్లిస్తే ఎందుకు నోరు విప్పలేదు? వినోద్ కుమార్ వంటి అహంకార భావజాలమున్న కేసీఆర్ కుటుంబ పాలనను అంతం చేయడానికి నేను ప్రజా సంగ్రామ యాత్ర చేసిననాని అన్నారు. నీ బంధువు కేసీఆర్ సీఎం అయ్యాక... నువ్వు ప్రజలకు చేసిందేమిటని నిలదీసారు. వినోద్ కుమార్ స్వయం ప్రకటిత మేధావి... నీ మేధావి తనం కరీంనగర్ ప్రజలకు ఏమైనా ఉపయోగపడిందా ? వినోద్ కు నిజంగా తెలివి ఉంటే... రాష్ట్రమంతా ప్రజలు ఏమనుకుంటున్నారో తెలుసుకుని మాట్లాడు. కేసీఆర్ ఫాంహౌజ్ దాటి రాకుంటే... ఎన్నడైనా అడిగివా ? బండి సంజయ్ కు సొంత వ్యాపారాల్లేవు... బండి సంజయ్ 24 గంటలు ప్రజల కోసమే పనిచేస్తున్నడని అన్నారు.

రాష్ట్రమంతా తిరిగి ప్రజల పక్షాన పోరాడింది బండి సంజయ్. ప్రజల కోసం యుద్ధం చేస్తే 100కు పైగా కేసులు బండి సంజయ్ పై పెట్టిందెవరు ? నిరుద్యోగులు, విద్యార్థులు, ఉద్యోగుల పక్షాన కొట్లాడితే కేసీఆర్ కుట్రల వల్ల బండి సంజయ్ ను జైలుకు పంపిన సంగతి మర్చిపోయినవా ? కేసీఆర్ ను ఫాంహౌజ్ నుండి ప్రజల్లోకి గుంజుకొచ్చిందెవరో అందరికీ తెలుసు. అసలు వినోద్ కుమార్ లోకల్ కానే కాదు... నువ్వు నిజంగా లోకల్ అయితే కరీంనగర్ ప్రజల పక్షాన ఎందుకు కొట్లాడలేదు ? కేసీఆర్ కు రైట్ హ్యాండ్ నువ్వే కదా.... కష్టాల్లో ఉన్న ప్రజలను ఎందుకు ఆదుకోవడం లేదు ? నాకు ఈటలతో సహా ఎవరితోనూ విబేధాల్లేవు. పార్టీ ఆదేశాల మేరకు పనిచేయడమే తప్ప మరో ఆలోచనకు తావివ్వను. ఈటల సీనియర్ నేత...అనుభవమున్న నేత కాబట్టి హుజూరాబాద్ లో ఎన్నికల ప్రచారానికి రాలేదు. హడావుడి, హల్ చల్ కు తావు లేకుండా గావ్ చలో అభియాన్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. వినోద్ కుమార్ సహా బీఆర్ఎస్ అభ్యర్థులందరిదీ ఎంపీ ఎన్నికల్లో మూడో స్థానానికే పరిమితం కాబోతున్నరు. దేశానికి రక్ష మోదీ మాత్రమేనని ప్రజలంతా భావిస్తున్నారు. ఎంపీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఏ ముఖం పెట్టుకని ప్రజల్లోకి వెళతారని ప్రశ్నించారు.

# 13న మొదటి బహిరంగసభ

నల్గోండ, ఫిబ్రవరి 7 : దక్షిణ తెలంగాణ లీడర్లతో బీఆర్ఎస్ పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ సమావేశం అయ్యారు. కేసీఆర్ ఈనెల 13 న నల్లగొండ లో బహిరంగ సభ నిర్వహించనున్నట్లు? నల్లగొండ, మహబూబ్ నగర్, ఖమ్మం జిల్లాల నుంచి ప్రజలు తరలించాలని పార్టీ నేతలకు సూచించారు. ఇదంతా పాలకులకు ప్రాజెక్ట్ లు, నీళ్ళ గురించి అవగాహన లేకపోవడం తో కేంద్రం గేమ్ స్టార్ట్ చేసిందని ఆయన అన్నారు. ప్రాజెక్ట్ లు ఆధీనం లోకి వెళితే తెలంగాణ నష్టపోతుందని, కాంగ్రెస్ నేతలకు అవగాహన లేక ఏదేదో మాట్లాడుతున్నారని ఆయన అన్నారు. డ్యాం కు సున్నం వేయాలన్న కూడా బోర్డు అనుమతి తీసుకోవాల్సి ఉంటుందన్నారు. ఎన్ని అడ్డంకులు సృష్టించినా ఈ నెల 13న సభ నిర్వహించి తీరుతామని కేసీఆర్ అన్నారు. బీజేపీ నేతృత్వంలోని కేంద్రం ఆధ్వర్యంలో పనిచేసిన కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డుకు సాగునీటి పరిరక్షణను అప్పగించడాన్ని తీవ్రంగా నిరసిస్తూ, నాగార్జున సాగర్, శ్రీశైలం ప్రాజెక్టులను రాష్ట్ర ప్రభుత్వాలకు అప్పగించడం వల్ల కలిగే పరిణామాలపై చంద్రశేఖర్ రావు చర్చకు నాయకత్వం వహించారు. ఐఖీఓః, తద్వారా రాష్ట్ర రైతులకు కలిగే నష్టాలు. రాష్ట్ర ప్రభుత్వ రైతు వ్యతిరేక వైఖరిపై అనుసరించాల్సిన చర్యలపై సమావేశంలో చర్చించారు. తెలంగాణ ఉద్యమ సమయంలో బీఆర్ఎస్ తెలంగాణ సాగునీటి, తాగునీటి హక్కుల కోసం పోరాడడమే కాకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం ఏర్పాటైన తొలినాళ్లలోనే 'మా నీళ్లు మాకే' (మన నీరు మనకే) అనే నినాదాన్ని నిజం చేసిందని పేర్కొన్నారు. కేంద్రం ఒత్తిడిని ఎదిరిస్తూ కృష్ణా నది ప్రాజెక్టులపై తెలంగాణ హక్కులను కూడా బీఆర్ఎస్ ప్రభుత్వం కాపాడింది. కాంగ్రెస్ ప్రభుత్వ నిర్ణయంతో రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ప్రజలకు తాగునీటి ఎద్దడి ఏర్పడుతుందని, ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తున్న కాంగ్రెస్ నిర్ణయాన్ని ఉపసంహరించుకునేందుకు బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ప్రజా ఉద్యమం చేపడతామన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు తాగునీరు అందక తిరిగి కరువుకోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచివున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర మూర్ఖపు వైఖరిని తిప్పికొట్టి కృష్ణా జలాలపై ప్రాజెక్టులపై తెలంగాణకు రావాల్సిన వాటాను హక్కులను నూటికి నూరుశాతం కాపాడేందుకు ఎంతదాకనైనా పోరాడాల్సిందేనన్నారు.

కేఆర్ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణకున్న హక్కులను కైవసం చేసుకునేందుకు కేంద్రం వేసే ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ కేంద్రం ఒత్తిళ్లను తట్టుకుంటూ పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసి కాపాడిందన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యంతో సంతకాలు చేసి తీసుకున్న నిర్ణయంతో భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టలమీదికి కూడా పోలేని పరిస్థితి దాపురించిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ప్రజా మద్దతుతో తిప్పికొడుతామన్నారు.

# శాసనసభాపక్ష నేత ఎంపికపై సస్పెన్స్

హైదరాబాద్ : తెలంగాణ బీజేపీలో...శాసనసభాపక్ష నేత ఎంపికపై సస్పెన్స్ కొనసాగుతోంది. ఒకరు కాదు ఇద్దరు కాదు...పలువురు నేతలు దీనికి కోసం పోటీ పడుతున్నారు. సీనియర్లతో పాటు తొలిసారి గెలిచిన ఎమ్మెల్యేలు ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. శాసనసభ బడ్జెట్ సమావేశాలు దగ్గరపడుతున్నా, కాషాయ పార్టీ నేతలు మాత్రం తేల్చలేకపోతున్నారు. ఈ రేసులో గోషామహల్ నుంచి మూడుసార్లు గెలిచిన రాజాసింగ్ నిర్మల్ నుంచి రెండు సార్లు గెలుపొందిన ఆలేటి మహేశ్వర్ రెడ్డి తో పాటు తొలిసారి గెలుపొందిన కామారెడ్డి శాసనసభ్యుడు వెంకట రమణారెడ్డి , ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల్ శంకర్ తో ధన్ పాల్ సూర్యనారాయణ, పైడి రాకేశ్ రెడ్డి ఎవరి ప్రయత్నాల్లో వారు ఉన్నారు. గత డిసెంబర్‌లోనే కేంద్రహోంమంత్రి అమిత్‌షా తెలంగాణలో పర్యటించారు. అప్పుడు శాసనసభాపక్ష నేత అంశం కొలిక్కి వస్తుందని నేతలు భావించిన నేతలకు నిరాశే ఎదురైంది. అమిత్ షా ఎటు తేల్చకుండానే ఢిల్లీ వెళ్లిపోయారు.

దీంతో పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి తరుణ్‌చుగ్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేల నుంచి అభిప్రాయసేకరణ నిర్వహించారు. నేతల అభిప్రాయాన్ని హైకమాండ్ కు పంపారు. జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డాతో చర్చించిన బీజేఎల్పీ నేతను ప్రకటించనున్నట్లు తరుణ్ చుగ్ వెల్లడించారు. గురువారం నుంచి రాష్ట్ర శాసనసభ బడ్జెట్ సమావేశాలు ప్రారంభం కానున్నాయి. అసెంబ్లీ సమావేశాలకు మరో రోజే మిగిలి ఉన్నప్పటికీ...ఇప్పటికి అసెంబ్లీ పక్ష నేతను ఎంపికపై నిర్ణయాన్ని తీసుకోలేకపోతోంది. వరుసగా మూడుసార్లు గెలిచిన రాజాసింగ్...ఈ పదవికి ఆశలు పెట్టుకున్నారు. నగరం నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్న టి.రాజాసింగ్ పార్టీలో సీనియర్ ఎమ్మెల్యే. అయితే ఆయనకు తెలుగుపై పట్టులేకపోవడం మైనస్ మారనున్నట్లు తెలుస్తోంది. మరోవైపు ఏలేటి మహేశ్వర్‌రెడ్డి నిర్మల్ నుంచి రెండు పర్యాయాలు గెలుపొందారు. అయితే ఆయన ఎన్నికల ముందు కాషాయ పార్టీ తీర్థం పుచ్చుకున్నారు. అటు తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన కాటిపల్లి వెంకటరమణారెడ్డి పోటీ పడుతున్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని ఓడించారు. జెయింట్ కిల్లర్ గా ఆయనకు పేరుంది. రమణారెడ్డి తొలిసారి ఎమ్మెల్యేగా గెలవడం మైనస్ అవుతున్నట్లు తెలుస్తోంది. ఆయన తో పాటు ధన్ పాల్ సూర్యనారాయణ, ఆర్మూరు ఎమ్మెల్యే పైడి రాకేశ్ రెడ్డిలు బీజేఎల్పీ పదవికి ఆశలు పెట్టుకున్నారు. శాసనసభ కార్యకలాపాలపై అవగాహన, వివిధ అంశాలపై పట్టు, వివిధ వర్గాల ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై పూర్తిగా అవగాహన ఉండాలి. అధికార పార్టీకి ఎప్పటికపుడు కౌంటర్లు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ నేపథ్యంలో చురుగ్గా స్పందించగలిగే నేతకే బీజేఎల్పీ బాధ్యతలు అప్పగించాలనే అభిప్రాయంతో పార్టీ నేతలున్నట్టు తెలుస్తోంది. అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీని అధికారంలోకి తీసుకొస్తే బీసీ నేతను సీఎం చేస్తామని ప్రకటించింది. దీన్ని బీసీ ఎమ్మెల్యేలు ఇపుడు లేవనెత్తుతున్నారు. బీజేఎల్పీ నేతగా బీసీ ఎమ్మెల్యేకు అవకాశం కల్పించాలనే డిమాండ్ పార్టీలో వినిపిస్తోంది. బీజేపీ తమ నాయకుడ్నిఎపుడు తెలుస్తుందో వేచి చూడాలి.

# రెచ్చిపోతున్న మెడికల్ మాఫియా

హైదరాబాద్, ఫిబ్రవరి 7 : తెలంగాణలో మెడికల్ మాఫియా రెచ్చిపోతోంది. కొంత మంది కేటుగాళ్లు రక్తంతో చెలగాటం ఆడుతున్నారు. బ్లాక్ మార్కెట్ లో అమ్మకానికి సిద్ధంగా ఉన్న ప్లాస్మాను అక్రమంగా కొనుగోలు చేసి లక్షలు సంపాదిస్తున్నారు. మనుషుల ప్రాణాలతో చెలగాటమాడుతున్న మెడికల్ మాఫియా పై ఉక్కు పాదం మోపుతున్నారు డ్రగ్ కంట్రోల్ అధికారులు. హైదరాబాద్‌లో అడ్డగోలుగా జరుగుతున్న హ్యూమన్ ప్లాస్మా దందాకు డ్రగ్ కంట్రోల్ అథారిటీ అధికారులు చెక్ పెట్టారు. గత కొన్నేళ్ల నుండి గుట్టుచప్పుడు కాకుండా మూసాపేట్ లో హీమో సర్విస్ ల్యాబొరేటరీస్‌లో డీసీఏ తనిఖీలు నిర్వహించి భారీగా హిమాన్ ప్లాస్మా బ్యాగుల గుర్తించి, సీరం సైతం నిల్వలను సీజ్ చేశారు. ఒక యూనిట్ రూ.700కు కొని, రూ.3,800కు ముఠా అమ్ముతున్నట్లు డ్రగ్ కంట్రోల్ అధికారులు గుర్తించారు. నిబంధనలకు విరుద్ధంగా మానవ రక్తం, ప్లాస్మా, సీరం నిల్వచేస్తున్న ఓ ఇంటిపై డ్రగ్ కంట్రోల్ అడ్మినిస్ట్రేషన్ అధికారులు దాడులు నిర్వహించారు. అత్యంత అపరిశుభ్రమైన వాతావరణంలో వాటిని నిల్వచేస్తున్నట్టు గుర్తించారు. 2016 నుంచి కొనసాగుతున్న ఈ దందాకు సంబంధించి పలు కీలక వివరాలు సేకరించారు. తెలంగాణలోని వివిధ ప్రాంతాలతో పాటు ఇతర రాష్ట్రాల్లోని వారికి మానవ రక్తం, ప్లాస్మా, సీరం అక్రమంగా విక్రయిస్తున్నట్టు ఆధారాలు లభించాయి.అయితే డీసీఏ అధికారులు తనిఖీల చేసిన క్రమంలో విస్తుపోయే నిజాలను చూశారు. మూసాపేట్ భవానీనగర్‌లోని ఓ రెసిడెన్షియల్ భవనంలో నిబంధనలకు విరుద్ధంగా నడుపుతున్న హేమో సర్విస్ ల్యాబోరేటరీస్ లో సోదాలు చేపట్టారు. భారీగా హ్యూమన్ ప్లాస్మా బ్యాగులను గుర్తించారు. అదే ఆవరణలో ఉన్న ఫ్రీజర్‌లలో సీసాల్లో నిల్వ చేసిన సీరం, మానవ రక్తం గుర్తించారు. ఆర్.రాఘవేంద్ర నాయక్ దీనిని నడుపుతున్నట్టు గుర్తించారు. రాఘవేంద్ర నాయక్ అనే వ్యక్తి స్వతహాగా ఫార్మసీ బ్యాక్ గ్రౌండ్ కలిగిన వ్యక్తి కావడంతో రక్తానికి సంబంధించిన అవగాహన ఉంది. గత ఎనిమిదేళ్లుగా ప్లాస్మాను వివిధ బ్లడ్ సెంటర్ లో నుండి సేకరిస్తున్నట్టు గుర్తించారు. అనధికారిక పద్ధతుల్లో వివిధ బ్లడ్ బ్యాంక్‌ల నుంచి రక్తం సేకరించి, దాన్నుంచి ప్లాస్మా, సీరం తీసి రీ ప్యాకింగ్ చేసి విక్రయిస్తున్నట్టు తెలిసింది. రంగారెడ్డి జిల్లా మియాపూర్‌లో ఉన్న శ్రీకర హాస్పిటల్ బ్లడ్ బ్యాంక్, దారు ఉల్ షిఫాలోని అబిద్ అలీఖాన్ లయన్స్ ఐ హాస్పిటల్లో ఉన్న న్యూ లైఫ్ బ్లడ్ సెంటర్, కర్నూలు జిల్లా ధర్మపేటలోని భాగ్యనగర్‌లో ఉన్న ఆర్‌ఆర్ హాస్పిటల్ బ్లడ్ బ్యాంకు నుంచి అక్రమంగా రక్తం సేకరిస్తున్నట్టు డీసీఏ అధికారుల వద్ద రాఘవేంద్ర నాయక్ అంగీకరించారు. తెలంగాణ, ఏపీలోని పలు బ్లడ్ బ్యాంకుల నుంచి ఒక్కో యూనిట్ రక్తాన్ని 700 రూపాయలకు కొనుగోలు చేసి 3,800 వరకు విక్రయిస్తున్నట్టు కనుగొన్నారు. ఇలా రాఘవేంద్ర 2016 నుంచి ఆరువేల యూనిట్లకుపైగా రక్తాన్ని అక్రమంగా సేకరించి ప్లాస్మా, సీరం విక్రయించినట్టు డీసీఏ అధికారులు గుర్తించారు. విశాఖపట్నంలోని ఆక్టిమస్ బయోసైన్స్, హైదరాబాద్ ఐడీఏ బొల్లారంలోని క్లియాన్స్ ల్యాబ్స్, పుణేలోని క్లినోవి రీసెర్స్ ప్రై.లిమిటెడ్, బెంగళూరులోని జీ7 సినర్జీస్ ప్రై.లిమిటెడ్, మైక్రో ల్యాబ్స్, నార్విచ్ క్లినికల్ సర్వీసెస్ ప్రై. లిమిటెడ్, ఐడీఏ మల్లాపూర్‌లోని శిల్పా మెడికా లిమిటెడ్, మదీనగూడలోని జెన్‌రైస్ క్లినికల్ ప్రై.లిమిటెడ్, చర్లపల్లిలోని విమ్‌టా ల్యాబ్స్ లిమిటెడ్‌లకు విక్రయిస్తున్నట్టు గుర్తించారు. డ్రగ్ కంట్రోల్ అధికారుల సోదాల్లో భాగంగా హెచ్ఐవీ, ఇతర టెస్టింగ్ కిట్‌లు, పలు డాక్యుమెంట్లు స్వాదీనం చేసుకున్నరు. ఇల్లీగల్ గా డ్రగ్ మెయింటైన్ చేస్తున్న వారిపై డ్రగ్ కంట్రోల్ అథారిటీ పూర్తి స్థాయి నిఘా ఉందని డ్రగ్ సంబంధించి పర్మిషన్ తీసుకొని నిల్వ ఉంచాలని, లీగల్ గా మెయింటైన్ చేయాలని, లేకుంటే వారిపై చట్టరీత్యా కఠిన చర్యలు తీసుకుంటామని డ్రగ్ కంట్రోల్ అధికారులు హెచ్చరిస్తున్నారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

కరీంనగర్ : కరీంనగర్ జిల్లా శంకరపట్నం మండలం కొత్తగట్టు లో బుధవారం తెల్లవారురుఝామున ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది.కరీంనగర్ నుండి విజయవాడ వెళుతున్న కారును టిప్పర్ ఢీకొంది. కారులో ప్రయాణిస్తున్న ఇద్దరు మృతి చెందగా మరో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. కరీంనగర్ పట్టణం లోని కోతి రాంపూర్ కు చెందిన కోమురమ్మ, ప్రభాకర్, సదానందం, గీత అనే నలుగురు విజయవాడలో లారీ కొని తీసుకొనిరావడానికి వెళుతున్న క్రమం లో ఈ ప్రమాదం జరిగింది. కారులో ప్రయాణిస్తున్న కోమురమ్మ, ప్రభాకర్ అక్కడిక్కడే మృతి చెందగా గీత పరిస్థితి విషమం గా ఉండడం తో వరంగల్ కు తరలించారు. సదానందానికి స్వల్ప గాయాలయ్యాయి. కారులో ప్రయాణిస్తున్న వారిలో తల్లి కొమురమ్మ కొడుకు సదానందం కూతురు గీత కాగా మృతి చెందిన ప్రభాకర్ బంధువు గా తెలుస్తోంది.

# కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా బడ్జెట్ లో విద్యకు 15% నిధులు కేటాయించాలి

### బాలల హక్కుల సంక్షేమ సంఘం డిమాండ్

బడుగు బలహీన వర్గాల పిల్లల విద్యా ప్రగతికి ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో హామీ ఇచ్చిన విధంగా శాసన సభలో ప్రవేశ పెట్టే బడ్జెట్ లో విద్యకు 15% నిధులు కేటాయించాలని బాలల హక్కుల సంక్షేమ సంఘం(బీహెచ్ఎస్ఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇ. రఘునందన్ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి విజ్ఞప్తి చేశారు. ఈమేరకు శుక్రవారం పత్రికా ప్రకటన విడుదల చేశారు.



పాఠశాలలకు కనీస మౌళిక వసతులు కల్పించాలని, గతంలో ఉన్న విధంగా పారిశుధ్య కార్మికులను నియమించాలని కోరారు. బిఆర్ ఎస్ ప్రభుత్వం పారిశుధ్య కార్మికుల ను తొలగించి గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలకు ఆ బాధ్యత అప్పగించింది. ఐతే ఇది అదనపు బాధ్యతగా భావించిన గ్రామ పంచాయతీలు, మున్సిపాలిటీలు పాఠశాలల వైపు తొంగిచూడలేదు. దాంతో పాఠశాలల్లో పారిశుధ్యం పడకేసింది. విధిలేక ఉపాద్యాయులు, విద్యార్థులు తామే చీపుర్లు పట్టి తరగతి గదులు, గ్రౌండ్ శుభ్రం చేసుకుంటున్నారు. బలపం పట్టాల్సిన చేతులతో చీపుర్లు పట్టించింది గత బిఆర్ ఎస్ ప్రభుత్వం. కాబట్టి ఈ సారైనా విద్యారంగానికి సరిపోను నిధులు కేటాయించాలని కోరుతున్నాము. విద్యార్థులకు నాణ్యమైన యూనిఫాం దుస్తులు సరఫరా చేయాలని కోరారు.

# విమానాశ్రయం తరహాలో సికింద్రాబాద్ రైల్వేస్టేషన్: కిషన్‌రెడ్డి

హైదరాబాద్: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లోనూ భాజపా విజయం సాధిస్తుందని.. మళ్లీ నరేంద్ర మోదీనే ప్రధాని అవుతారని కేంద్ర మంత్రి, భాజపా రాష్ట్ర అధ్యక్షుడు కిషన్ రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని హోదాలో మోదీ నగరానికి వచ్చి.. అత్యాధునిక సదుపాయాలతో సిద్ధమవుతోన్న సికింద్రాబాద్



రైల్వే స్టేషన్‌ను ప్రారంభిస్తారన్నారు. ఆయన ఏ నిర్ణయం తీసుకున్నా కచ్చితంగా అమలు చేస్తారని చెప్పారు. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులను బుధవారం కిషన్ రెడ్డి పరిశీలించారు. పనుల పురోగతిపై దక్షిణ మధ్య రైల్వే జీఎం అరుణ్ కుమార్ జైన్, ఇతర అధికారులు ఆయనకు వివరించారు. అనంతరం నిర్వహించిన మీడియా సమావేశంలో కిషన్‌రెడ్డి మాట్లాడారు. "గతేడాది ఏప్రిల్‌లో ప్రధాని మోదీ సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ పునర్నిర్మాణ పనులను ప్రారంభించారు. అవి శరవేగంగా జరుగుతున్నాయి. అత్యాధునిక సౌకర్యాల కల్పనే లక్ష్యంగా కొనసాగుతున్నాయి. 2025 చివరి నాటికి పనులు పూర్తవుతాయి. పూర్తిగా విమానాశ్రయం తరహాలో రైల్వే స్టేషన్ రూపుదిద్దుకుంటుంది. చర్లపల్లి టెర్మినల్ పనులు చివరి దశకు చేరుకున్నాయి. త్వరలోనే అందుబాటులోకి తీసుకొస్తాం" అని వివరించారు.

## ఎట్టకేలకు చిక్కిన 200 కోట్లు ఎగవేతదారుడు

హైదరాబాద్, ఫిబ్రవరి 7: హైదరాబాద్ సెంట్రల్ క్రైమ్ స్టేషన్ (సీసీఎస్) పోలీసులు మోస్ట్ వాంటెడ్ ఆర్థిక నేరస్థుడిని అరెస్ట్ చేశారు. పెట్టుబడుల పేరుతో బ్యాంకుల నుంచి కోట్ల రూపాయల రుణాలు తీసుకొని నిండా ముంచుతున్న ఘరానా మోసగాడు చదలవాడ రవీంద్రబాబును సీసీఎస్ పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు. పంజాగుట్ట ఠాణాలో నమోదైన కేసుకు సంబంధించి నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ కావడంతో నెల రోజుల పాటు నిఘా ఉంచిన పోలీసులు ఎట్టకేలకు నిందితుడిని అదుపులోకి తీసుకున్నట్లు సీసీఎస్ ఏసీపీ అశోక్ కుమార్ వెల్లడించారు. ఏపీలోని నెల్లూరు ప్రాంతానికి చెందిన చేదలవాడ రవీంద్రబాబు బీఎస్సీ పూర్తి చేశాడు. కొనేళ్ల క్రితం బతుకుదెరువు కోసం హైదరాబాద్ నగరానికి వలస వచ్చాడు. ముందు ఉప్పల్ లో డైరీ ఫార్మ్ బిజినెస్ చేసిన రవీంద్రబాబు ఆపై ఎలక్ట్రికల్ ట్రాన్స్ఫార్మర్స్ కాంట్రాక్టర్ గా మారి నిజామాబాద్ నుంచి కాంట్రాక్టు పనులు ప్రారంభించాడు. అప్పటి నుంచి వివిధ రాష్ట్రాల్లోనూ ఈ కాంట్రాక్ట్ లను దక్కించుకొని తన వ్యాపారాన్ని విస్తరించాడు. అక్కడ వరకు బాగానే ఉన్నా.....ఆపైనే అసలు కథ మొదలు పెట్టాడు.ఫలానా కాంటాక్ట్ పూర్తి కావస్తుందని, అవసరమైన మొత్తం పెట్టుబడిగా ఇవ్వాలని పరిచయస్థులతో పాటు ప్రైవేట్ సంస్థలని ఆశ్రయించేవాడు. వీటితో పాటు బ్యాంకుల నుంచి రుణాలు తీసుకుని సొంత అవసరాలకు వాడుకునేవాడు. హైదరాబాద్ లోని నాచారం ఎస్బీఐ నుంచి గతంలో దాదాపు రూ. 179 కోట్ల రుణం తీసుకొని మోసం చేశాడు. కోల్ కతాలో ఒక సబ్ స్టేషన్ నిర్మాణానికి కాంట్రాక్ట్ దక్కించుకొని దానికి సంబంధించిన పత్రాలను బ్యాంక్ లో సమర్పించి రూ.179 కోట్ల రుణం తీసుకొని బ్యాంక్ ను మోసం చేశాడు. అయితే అప్పటికే రవీంద్రబాబు పశ్చిమబెంగాల్, బీహార్, చత్తీస్ గఢ్, కర్ణాటక, రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో కాంట్రాక్టర్లు చేసి ఉండడంతో అతడికి తేలికగా రుణం, అప్పులు లభించాయి.రూ. 40 కోట్ల మోసంపై పంజాగుట్ట పోలీస్ స్టేషన్ లలో రవీంద్రబాబుపై కేసులు నమోదయ్యాయి. అతడిపై నాన్ బెయిలబుల్ వారంట్ ఇష్యూ కావడంతో సీసీఎస్ ఏసీపీ అశోక్ కుమార్ రంగాల్లోకి దిగారు. రవీంద్ర బాబు ఎక్కడ ఉన్నాడనే అంశాన్ని సాంకేతికంగా ఆరా తీయగా... ఇతర రాష్ట్రాల్లో ఉన్నట్లు గుర్తించారు. దీంతో దాదాపు నెల రోజుల నుంచి అతని కదలికలను గమనిస్తూ వచ్చారు. బెంగళూరు, దిల్లీ, ముంబయిలో సంచరించిన నిందితుడు రవీంద్రబాబును సోమవారం ఈడీ కేసు నిమిత్తం ఆ కార్యాలయంలో హాజరు కావడానికి వచ్చారు. ఆ సమాచారాన్ని తెలుసుకున్న హైదరాబాద్ పోలీసులు అతడిని అదుపులోకి తీసుకొని పంజాగుట్ట పోలీసులకు అప్పగించారు. రవీంద్రబాబుపై ఏపీలోని ప్రకాశం, నెల్లూరు జిల్లాలతో పాటు కర్ణాటక ,రాజస్థాన్ ,మహారాష్ట్ర, సీబీఐ కేసులు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. పోలీసుల ప్రాథమిక విచారణలో అతడు రూ.200 కోట్ల రుణాలు తీసుకున్నట్లు నిందితుడు రవీంద్రబాబు అంగీకరించాడు.


# దాచుకోవడం...దోచుకోవడం ఏనా

హైదరాబాద్ : తెలంగాణ సంపదను, ఉద్యోగాలను, నీళ్లను ఆంధ్రులు దోచుకుపోతున్నారన్న ఉద్దేశం నుంచే ప్రత్యేక రాష్ట్ర ఉద్యమం మొదలైంది. స్వపరిపాల, ఇక్కడి నిధులు ఇక్కడే ఖర్చు చేయాలని, నీళ్లను తెలంగాణ భూములకు మళ్లించాలని, ఉద్యోగాల్లో తెలంగాణకు ప్రాధాన్యం ఇవ్వాలని 60 ఏళ్లు జరిగిన ఉద్యమంతో ప్రత్యేక రాష్ట్రం సిద్ధించింది. అయితే అప్పుడు ఆంధ్రోళ్లు మన సంపద దోచుకుపోతున్నారని ఉద్యమం చేసిన నేతలే.. ఇప్పుడు తెలంగాణ సంపదను దోచుకున్నారు. దోచుకుంటున్నారు. హెచ్ఎండీఏ మాజీ డైరెక్టర్‌పై జరిపిన ఏసీబీ దాడులతో బీఆర్ఎస్ డొంక కదులుతున్నట్లు తెలుస్తోంది. ఒక డైరెక్టర్‌స్థాయి అధికారి ఇంట్లో కిలోలకు కిలోల బంగారం, నోట్ల కట్టలు, విలువైన వస్తువులు పట్టుబడడంతో అధికారులు కూపీ లాగుతున్నారు.


మీ నాయకత్వం అద్వితీయం...
మీ కార్యకర్తల మీద మీరు చూపించే ఆప్యాయత అమోఘం...
భువనగిరి శాసన సభ్యులు
శ్రీ కుంభం అనిల్ కుమార్ రెడ్డి గారికి
జన్మదిన శుభాకాంక్షలు

# పవన్ హీరోయిన్‌ని ఇలా ఎప్పుడూ చూడలేదు!

'కహోనా ప్యార్ హై'తో దేశవ్యాప్తంగా భారీ ఫాలోయింగ్ సంపాదించుకున్న అమీషా పటేల్ ఆ తర్వాత 'బద్రి' సినిమాతో టాలీవుడ్ కి పరిచయమైంది. హృతిక్ సరసన బాలీవుడ్ లో, పవన్ కల్యాణ్ సరసన టాలీవుడ్ లో పరిచయమైంది. అటుపై తెలుగులో పలువురు అగ్ర హీరోల సరసన నటించింది ఈ బ్యూటీ. పవన్ కల్యాణ్, మహేష్, బాలకృష్ణ లాంటి టాప్ స్టార్ల సరసన నటించింది. కానీ దురదృష్టవశాత్తూ ఇక్కడ ఆశించిన స్థాయికి ఎదగలేదు. అటుపై బాలీవుడ్ లో వరుస చిత్రాలతో బిజీ అయింది. అక్కడ అగ్ర హీరోల సరసన అమీషా నటించింది. కెరీర్ ఆద్యంతం తనదైన అందం, హొయలుతో ఉర్రూతలూగించిన అమీషా పటేల్ కి ఇటీవల ఏజ్ సమస్యలు ఎక్కువయ్యాయి. వయసు పెరుగుతుంటే పోటీ ప్రపంచంలో అమీషాకు అవకాశాలు తగ్గిపోయాయి. దీంతో ఈ బ్యూటీ సోషల్ మీడియాల్లో గేమ్ ఛేంజర్ గా మారేందుకు తనవంతు ప్రయత్నాలను విడిచిపెట్టడం లేదు. పదే పదే బోల్డ్ ఫోటోషూట్లతో విరుచుకుపడుతోంది. తాజాగా అమీషా షేర్ చేసిన ఫోటోషూట్ దీనికి సింబాలిక్ అంటూ నెటిజనులు కామెంట్లు చేస్తున్నారు. కునుకు కరువే ఇటీవలే గదర్ 2తో భారీ బ్లాక్ బస్టర్ అందుకున్న అమీషా నిరంతరం తన సోషల్ హ్యాండిల్‌లో బోల్డ్ ఫోటోలు, వీడియోలను షేర్ చేస్తోంది. ఇవన్నీ తక్షణమే వైరల్ అవుతున్నాయి. తాజాగా బ్లాక్ బికినీలో హొయలు పోయిన ఫోటోలు వైరల్ అయ్యాయి.




అమీషా బ్లాక్ బికినీని ధరించి అందాలను స్వేచ్ఛగా ప్రదర్శిస్తోంది. షిమ్మరీ బేస్డ్ మేకప్ లో చాలా స్పెషల్ గా కనిపిస్తోంది. గత ఏడాది గదర్ 2తో బాలీవుడ్‌లోకి కంబ్యాక్ అయిన అమీషాకు ఇప్పటికీ అవకాశాల్లేవ్. అందుకే వెండితెరకు దూరంగా ఉన్నప్పటికీ అమీషా పటేల్ సోషల్ మీడియాలో మాత్రం ఎక్కడా తగ్గడం లేదు. అమీషా పటేల్ కెరీర్ పరంగా సుదీర్ఘ కాలం సవాళ్లను ఎదుర్కొంది. తన 23 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణంలో కేవలం నాలుగు హిట్ లను మాత్రమే సాధించింది. సన్నీ డియోల్ సరసన గదర్ తో అత్యున్నత స్థాయికి చేరుకున్నప్పటికీ, సన్నీ సోదరుడు బాబీ డియోల్‌తో సినిమాలు తన కెరీర్‌ను దెబ్బతీసాయి. హృతిక్ రోషన్ – అమీషా పటేల్ ఇద్దరూ 2000లో విడుదలైన కహో నా ప్యార్ హైతో కెరీర్ ని ప్రారంభించారు. ఈ చిత్రం భారీ విజయాన్ని అందించింది. ఈ చిత్రంతో తక్షణ స్టార్‌డమ్‌ని సాధించారు. ఈ స్టార్‌డమ్ పాపులారిటీ కారణంగానే అమీషాకు గదర్‌లో సకీనా పాత్రలో అవకాశం వచ్చింది. కానీ తర్వాత బాబీ డియోల్ సరసన క్రాంతి -హుమ్రాజ్‌లో రెండు బ్యాక్ టు బ్యాక్ చిత్రాలలో కనిపించింది. అవి రెండూ డిజాస్టర్లు అవ్వడంతో తన కెరీర్ డోలాయమానంలో పడింది. ఇటీవల సహాయ నటిగా కొనసాగుతోంది. మరాఠాలోను నటిస్తోంది.

# అందాల తూనీగ.. అనన్య పాండే!!



బాలీవుడ్ నటవారసురాళ్లలో అనన్య పాండే ప్రత్యేకత గురించి తెలిసిందే. నేటి జనరేషన్ లో స్పీడ్ ఉన్న ఫ్యాషనిస్టాగా ఇప్పటికే యూత్ గుండెల్లో నిలిచింది. లుక్ పరంగా ఈ భామ నిరంతర ప్రయోగాలు అందరినీ ఆకర్షిస్తున్నాయి. తాజాగా అనన్య తూనీగ వేషం అభిమానులను ఆశ్చర్యపరుస్తోంది. ఇటీవల ప్యారిస్ లో ర్యాంప్ పై నడిచిన అనన్య ఒక ప్రత్యేకమైన డిజైనర్ లుక్ తో షాక్ వేవ్స్ పంపింది. ఒక అందమైన తూనీగ తన ఎద అందాలను కప్పి ఉంచే ఆ దృశ్యం ఎంతో ముగ్ధ మనోహరంగా కనిపించింది. ఎంపిక చేసుకున్న డిజైన్ యూనిక్ నెస్ తో కట్టి పడేసింది. ఈ డ్రెస్ ని రూపొందించినది ప్రముఖ బాలీవుడ్ ఫ్యాషన్ డిజైనర్ రాహుల్ మిశ్రా. దీనికి స్ఫూర్తి క్రిమి కీటకాలు అని అతడు వెల్లడించాడు. కునుకు కరువే అనన్య తాజాగా తన పారిస్ ట్రిప్ నుంచి కొన్ని అద్భుతమైన ఫోటోలు, వీడియోను షేర్ చేయగా అవి వైరల్ గా మారాయి. అనన్య దీనికి అందమైన క్యాప్షన్ ని కూడా ఇచ్చింది. "ఇది అలాంటి క్షణం! పారిస్ కోచర్ వీక్‌లో రాహుల్ మిశ్రా కోసం వాకింగ్" అంటూ సీతాకోక చిలుక, ఫ్లై, తూనీగ సహా ఇతర కీటకాల ఈమోజీలను షేర్ చేసింది. మన పర్యావరణంలోని కీటకాలు సరీసృపాలతో జీవితాన్ని పంచుకోవడంలోని ఆనందం వేరు. అందరి దృష్టిని ఆకర్షించే సూపర్‌హీరోస్ (క్రిమి కీటకాలు) సేకరణ వెనుక ఉన్న ఆలోచన నాకు బాగా నచ్చింది. గ్రహం మీద మన జీవితాలను నిర్మించుకునే ప్రయత్నంలో కీటకాల ఆవాసాలను స్వాధీనం చేసుకుని వాటిని అంతరించిపోయేలా మానవాళి చేసి ఉండవచ్చు" అని వ్యాఖ్యానించింది పాండే గాళ్. నిజానికి ఇది ఆలోచింపజేసే అద్భుతమైన థాట్. మనుషులు తమ ఇండ్లను నిర్మించుకునేందుకు పక్షులు, జంతువుల నివాసాలను కబ్జా చేస్తున్న వైనం భయపెడుతోంది. ఇక చెట్లు, అడవులను నరికి వేస్తుండడంతో అక్కడ జీవించే ఎన్నో మూగ జీవాలు, క్రిమి కీటకాల జీవనం కూడా ప్రమాదంలో పడుతోంది. ఇదే సందేశాన్ని రాహుల్ మిశ్రా తన ఫ్యాషన్ షోలో ప్రజలకు అందించారు. కాక్ టెయిల్ 2లో ఆఫర్: గ్లోబల్ స్టార్ దీపికా పదుకొణె 2012లో వచ్చిన హోమీ అదజానియా చిత్రం 'కాక్‌టెయిల్'తో కెరీర్ పరంగా గ్రేట్ కంబ్యాక్ ని చూపించింది. ఈ బ్లాక్ బస్టర్ సినిమా దీపికా పదుకొణెని మళ్లీ రేసులోకి తీసుకురావడమే కాకుండా నటిగా తన క్యాలిబర్‌ని నిరూపించుకునే అవకాశం కల్పించింది. ఇప్పుడు కాక్‌టెయిల్ సీక్వెల్ పనిలో ఉన్నట్లు సమాచారం. యువతరం నటీనటులు అనన్య పాండే – సారా అలీ ఖాన్ కాక్‌టెయిల్ 2 లో నటించే వీలుందని తెలిసింది. సీక్వెల్‌లను రూపొందించే ధోరణి బాలీవుడ్ లో ఇటీవల మరోసారి జోరందుకుంది. రోహిత్ ధావన్ దేశీ బాయ్జ్ 2 సహా ఇప్పటివరకు చాలా చిత్రాలు ఈ జాబితాలో చేరాయి. గురువారం సైఫ్ అలీ ఖాన్ – దీపికా పదుకొనేల చిత్రం కాక్‌టెయిల్ సీక్వెల్ గురించి కూడా చాలా చర్చలు జరిగాయి.








# ఆ హీరోతో పెళ్లి.. లైవ్ లో చెక్ పెట్టిన హీరోయిన్

ఇటీవల కాలంలో తెలుగులో కొంతమంది హీరోయిన్లు బడా నిర్మాతల కోడళ్లుగా సెటిల్ అయిపోతున్నారు అని వార్తలు వచ్చిన సంగతి తెలిసిందే. వకీల్ సాబ్ మూవీ ఫేమ్ అనన్య నాగళ్ల పై కూడా అలాంటి ప్రచారమే వచ్చింది. 'మల్లేశం' సినిమాతో నటిగా మంచి గుర్తింపు తీచ్చుకున్న అనన్యకు వరుసగా



పెద్ద సినిమా ఆఫర్లు వస్తున్నాయి. అలాంటి టైమ్ లో అనన్య ఓ నిర్మాత ఇంటికి కోడలిగా వెళ్ళిపోతుందని, తక్కువ టైమ్ లోనే జాక్ పాట్ కొట్టిందని వార్తలు వచ్చాయి. అందులో ఎంత నిజం ఉందో ఎవరికి తెలియదు. దానిపై ఆమె కూడా స్పందించలేదు. ఆ తర్వాత మిడిల్ క్లాస్ మెలోడీస్, స్వాతిముత్యం వంటి సినిమాలతో టాలీవుడ్ లో మంచి గుర్తింపు తెచ్చుకుంది వర్ష బొల్లమ్మ. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మకి వరుస అవకాశాలు వస్తున్నాయి. ఆపవమ్మా ఇలాంటి తరుణంలో 'స్వాతిముత్యం' సినిమాలో తనతో కలిసి నటించిన బెల్లంకొండ గణేష్ తో రిలేషన్ లో ఉందని, వీళ్లిద్దరు త్వరలోనే పెళ్లి చేసుకోబోతున్నారని పలు వార్తలు సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టాయి. ఆ న్యూస్ వచ్చినప్పుడు వర్షా ఫన్నీ గా రియాక్ట్ అయింది. ఇక తాజాగా మరోసారి 'ఊరు పేరు భైరవకోన' ప్రమోషన్స్ లో ఇదే విషయంపై స్పందించింది. విఐ ఆనంద్ దర్శకత్వంలో సందీప్ కిషన్, వర్ష బొల్లమ్మ జంటగా నటించిన 'ఊరు పేరు భైరవకోన' మూవీ ఫిబ్రవరి 16 విడుదల కాబోతోంది. ఈ సినిమా ప్రమోషన్స్ లో భాగంగా పెళ్లిపై వచ్చిన రూమర్స్ గురించి వర్ష స్పందిస్తూ.." మేము బెస్ట్ ఫ్రెండ్స్ అయినా, ఇద్దరం కలిసి బయట తిరిగినా ఇలాంటి న్యూస్ వస్తే నమ్మొచ్చు. ఎప్పుడూ ఒకరి గురించి ఒకరు మాట్లాడుకోవడం కానీ, నేను ఏదైనా పోస్ట్ చేస్తే అందుకు తాను రియాక్ట్ అవ్వడం, తన పోస్ట్ కి నేను రియాక్ట్ అవ్వడం లాంటి పనులు చేస్తే అందులో అర్థం ఉంటుంది.

Printed, Published and owned by **Kalakonda Ramakrishna**, Printed at M/s. Swetha Offset Printers, H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State and Published from H.No. 2-10-92, Weekly Bazar, Boigally, Nizamabad-503001, Telangana State, Editor: **Kalakonda Ramakrishna**, RNI. Regn.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com